**జరిగిన కథ :** రాత్రివేళ మౌనంగా ఉండే రాజనగరులో.. ఓరోజు హఠాత్తుగా ఓ రాగాలాపన! ఎవరో స్త్రీ.. మధురంగా గానం చేస్తున్నది. అది విన్న జాయపుడు.. విస్మయంతో బయటికి వచ్చాడు. ఆ గానం వినవస్తున్న వైపుగా నడుస్తూ.. ఓ భవనపు మొదటి అంతర్వుపై నుంచి రాగం ఆలపిస్తున్న ఆ మహిళ ను చూశాడు. ఆ మరునాడు ఆ భవంతిలో ఎవరు ఉంటారో తెలుసుకున్నాడు జాయపుడు. సిద్ధయదేవుని ఏకైక కుమార్తె.. ఇంద్రాణిదేవి, ఆమె గాయనీమణి అని కూడా తెలిసింది. ఆమె గానం.. అందులోని శాస్త్రీయత.. అంతకుమించి ఆమె స్వరంలోని గాఢత అతణ్ని వదిలిపెట్టడం లేదు. రాత్రి కాగానే.. మళ్లీ వచ్చి డొంకల్లో తిరుగాడాడు.



59
ధారావాహిక

# జాయ సేనాపతి


మత్తి భానుమూర్తి ...
99893 71284


చారిత్రక కాల్పనిక నవల

రాజనగరిలో ఆడ మగ మధ్య ఉండే దూరాలు.. జాయపుని కుర్ర హృదయాన్ని బాధ పెడుతున్నాయి. కళా హృదయులైన ఇద్దరు తమతమ కళల సొబగుల్ని పంచుకుంటూ.. ఆయా రంగాలలోని మహామహుల్ని స్మరించుకుంటూ, వారివారి ప్రతిభను విశ్లేషించు కుంటూ.. ఆనందంగా కళలలోకంలో చర్చానందం పొందడానికి ఇక్కడ ఆస్కారం లేదు. గురుకులంలో ఆ వాతావరణాన్ని గడిపాడు.

అక్కడ కూడా అబ్బాయిలు, గురువులు, అమ్మాయిలతో కళాత్మక ముచ్చట్లు పంచుకున్నాడు. ఆడపిల్లలతో తక్కువే.. అంతా మీదమీదకు వచ్చేసేవారు.

అయ్యనవోలులో కాకతితోనూ, భైరవతోనూ, కొండయతోనూ ఎన్నో చర్చలు చేసేవాడు.. ఎవరూ అడ్డు పెట్టింది లేదు. ఇక్కడ కాకతిలాగే ఓ కళామహిమ తెలిసిన అమ్మాయి ఉంది. కానీ, ఆమెతో కబుర్లు చెప్పుకొనే అవకాశం ఇక్కడ లేదు. ఏమిటో ఈ రాచరికాలు.. ఈ రాజప్రాసాదాలు..

ఎలాగైనా.. పెద్దలతో చెప్పి అయినా ఆమెను కలవాలి. కళా సంస్పందనలు పంచుకోవాలి. ఆమె భావుకతలో తను కొంత సహాయపడాలి. తన ఆలోచనలను ఆమె భావనల్లో కలగలపాలి. అలాగే నాట్యంలో తన ప్రతిభ ఆమె ముందు ప్రదర్శించాలి. ఆమె తన ప్రదర్శనలోని తప్పొప్పులు చెబితే సరిచేసుకుని.. మరింత మెరుగులు దిద్దుకోవాలి..

ఆమె పాట పూర్తి చేసిందో లేదో.. ఓ మధురమైన రాత్రిని ఆమె ఎంతో సున్నితమైన భావనలతో, అందుకు తగిన పదాలతో అల్లుతున్నది.

'బావుంది బావుంది!' అనుకుంటూ.. మరునాటి పగలంతా ఆమె ఆలోచనలతో గడిపాడు.

రాత్రి మొదటిజాము దాటాక మెల్లగా బయటికి వచ్చాడు. రాజభవనాలు ఆముదపు కాగడాల నిస్తేజపు వెలుగుల్లో నిద్రకు ఉపక్రమిస్తున్నాయి. ముందూ వెనకా చుట్టుకుంటూ మిణుగురులు..

ఇంద్రాణి భవనమున్న డొంకలోకి వచ్చాడు.

కాపలాభటుడు కనిపిస్తాడేమోనని అటూ ఇటూ చూస్తూ అడుగులు వేస్తున్నాడు. అప్పుడే.. ఆ అంతర్వు తలుపు తెరచుకుని ఆమె బయటికి వచ్చింది. ఆనందంగా అటువైపు అడుగులు వేశాడు.

ఆమె కాగడాతో భవనపు అంచువరకూ వచ్చి.. డొంక వైపు దృష్టి సారించింది.

ఎందుకు చూస్తున్నది? ఎవరి కోసం చూస్తున్నది? కాగడా ఎత్తిపట్టి వసారా అంచునుంచి ముందుకు వంగి చూస్తున్నది. ఆ భంగిమలో ఆమె ముఖం మరింత స్ఫుటంగా భాసిస్తున్నది. అలంకరణ లేని ఆమె మోము.. మూట కట్టిన వెన్నెల్లా ఉంది. కనురెప్పల కదలికలు ఉవ్వెత్తున ఎగసి.. ఆమె చూపులు అన్నివైపులా కదలిన నదీ